సీతమ్మ వారికి లక్ష్మణుడంతటి "ఒదినా విధేయుడిని" కాకపోయినా, గాస్ కంపెనీ దగ్గిర రిక్షా ఆపించి లోపలికి వెళ్ళేను. అక్కడ -

మేనేజరు స్థానంలో ఆంజనేయులు కూర్చుని వున్నాడు!

"ఆ రోజు ఢిల్లీలో కచేరీకి మీరు రాలేదుగాని, పెట్రోలియం మినిష్టరుగా వున్న దత్తాత్రేయ గారు వచ్చేరండి. ఆయన ఆ కార్యక్రమానికి ఛీఫ్ గెస్టన్నమాటండి. ఆయన మా చిన్నమ్మమ్మ గారి అల్లుడండి. కచేరీ అయిపోయాక నన్ను వాళ్ళ బంగళాకి తీసుకెళ్లి ఎవరెవరికో ఫోన్లు చేసి ఏవేవో కాయితాలు తెప్పించి సంతకాలు చేయించుకున్నారండి. "ఎన్ని కచేరీలకి పక్కవాద్యం వాయిస్తే వృద్ధిలో కొస్తావు? పో, బెజవాడలో గేస్ ఔట్‌లెట్ పెట్టుకో!" అని బేంకులకి చెప్పి డిపాజిట్టు అప్పు ఇప్పించడం నుంచీ అన్నీ ఆయనే చేసేరండి. అలా ఇక్కడ స్థిరపడ్డానండి!" అన్నాడు. మా వదినగారి ఇంటెడ్రసు అడిగి, అక్కడ వప్పగించడానికి అప్పటి కప్పుడుఒక సిలిండరు (రీఫిల్) తెప్పించి బోయ్‌కి పురమాయించేడు.

ఆ బోయ్ ఆ సిలెండర్ని సైకిలుకి కట్టుకుంటూ వుండగా ఆంజనేయులు (ప్రవృత్తి చాపల్యం చేత) ఆ సిలెండరు మీద తన చేతి వేళ్లతో "తధిగిణతోం, తకధిమి తధిగిణతోం!" వాయించి "ఒకే" అన్నాడు. ★

# 96. విగ్రహపుష్టి

"ఒద్దురా, నువ్వు హైదరాబాదులో ఉద్యోగం చెయ్యలేవురా," అంటే కూడా వినిపించుకోకుండా ఇంటర్వ్యూకి తయారయ్యేడు మా మేనల్లుడు.

ఆ కంపెనీ వాళ్ళు హైదరాబాదు సికింద్రాబాదు జంటనగరాల్లో తిరిగి తమ ఉత్పత్తులను గురించి ప్రచారం చేస్తూ సేల్సు పెంచగలిగే యువకులు కావాలన్నారు. "ఏముంది. బస్సుపాస్ తీసుకుని మల్కాజిగిరి నుంచి మెహదీ పట్నం దాకానూ, చార్మినార్ నుంచి బొలారం దాకానూ, వనస్థలిపురం నుంచి రామచంద్రపురం దాకానూ తిరిగేస్తాను - అన్నాడు. కొన్ని లొకాలిటీల పేర్లు తెలిస్తే తెలిశాయి గాని ఇక్కడ పుట్టి పెరిగిన వాళ్లకే ఇస్తారేమోనురా అంటే, "నాకు తెలుసులే, నేను ఈ వూళ్లో నీలోఫర్ ఆస్పత్రిలోనే పుట్టేనట కదా! మా అమ్మ చెప్పింది," అన్నాడు. ఇంటర్వ్యూ ఆర్కే పురంలో జరుగుతుందట. "అక్కడకి ఎలా వెళ్లాలో చెబితే మిగతా సంగతి నేను చూసు కుంటాను మామయ్యా" అన్నాడు. వాడి ఆత్మ విశ్వాసాన్ని అగౌరవపరచడానికి ఇష్టపడక మా కంపెనీ కారులో వాణ్ణి అక్కడికి దిగబెట్టి, సాయంకాలం నాలుగింటికి వస్తాను, ఇక్కడే వుండు అని చెప్పి నా పనులమీద నేను వెళ్లిపోయాను.

నాలుగ్గంటలన్నాను గాని మూడున్నరకే అక్కడికి చేరేను. మా ఫ్రెండు ఒకాయనని కారు అడిగి తీసుకుని.

"ఎలా జరిగింది రా, ఇంటర్వ్యూ?" అని పలకరించాను.

"నా మొహంలా జరిగింది." అన్నాడు కారెక్కుతూ.

"అంటే చాలా అందంగా జరిగిందన్నమాట!" అని వాణ్ణి కుషీ చేసేను. "ఇంతకీ ఏమిటి అడిగేరు ఇంటర్వ్యూలో?"

"టప్పాచబుత్రా అంటే ఏమిటి అని అడిగేరు. హైదరాబాదులో ఒక ప్రదేశం అని చెప్పాను. అక్కడికెప్పుడయినా వెళ్లేవా అన్నారు. వెళ్ళలేదన్నాను. ఎందుకు వెళ్ళేవు కాదూ అన్నారు. ఆ ఏరియా ఏడాదికి ఎనిమిది మాసాలపాటు కర్ఫ్యూలో ఉంటుందండీ. అదే కాదు, షా ఇనాయత్ గంజి, చాంద్రాయణ గుట్ట, డబ్బీరు పురా ఇలాటి ఏరియాలు కూడా అంతే కాదండీ - అన్నాను. దాంతో ప్లేటు మార్చి, 'టాంకు బండు మీద ఎన్టీ రామారావు గారు పెట్టించిన విగ్రహాలు ఎన్ని, అవి ఎవరెవరివి?' అని అడిగేరు.

"అమ్మ, వీళ్ల దుంపతెగ...!"

"ఆ మాట మీద నేనన్నానూ; పావుగంట టైమివ్వండి సార్, బైట లాబీలో కూర్చుని ఇంకా వివరాలు కూడా రాసుకొస్తానూ - అన్నాను."

"వివరాలేమిటి?"

"మొత్తం ముప్ఫయిమూడు విగ్రహాలన్న సంగతి నాకు గుర్తుంది. ఆ పేర్లన్నీ ఒక కాగితం మీద రాసుకుంటే అందులో ఆంధ్రా ఏరియా వాళ్లు ఎందరు, తెలంగాణా వాళ్లెందరు, రాయలసీమ వాళ్లెందరు; హిందువులు ఎందరు; ముస్లిములు ఎందరు; క్రిస్టియన్లు ఎందరు, హిందువుల్లో ఏయే కులాల వాళ్లు ఎందరెందరు; ఇలా టేబ్యులేషన్ చేసి సమాచారం ఇద్దామని నా ఉద్దేశం."

నాకు నవ్వొచ్చింది. "మరి నీకు వాళ్ళు పావుగంట టైమిచ్చి లాబీలోకి వదిలేరా?" అని అడిగాను.

"లేదు. ఇక్కడే కూర్చుని రాయి. ఈ లోపుని మేం టీలు తెప్పించుకుని తాగుతాం. అని రెండు తెల్లకాయితాలూ ఓ బాల్‌పాయింటు పెన్నూ యిచ్చి కూచోబెట్టారు. నేను ఒక కార్బన్ పేపరు కూడా అడిగి పుచ్చుకుని నా ఆన్సర్ పేపరు రెండు కాపీలు తయారు చేసేను."

"రెండెందుకూ?"

"మళ్లీ ఇంకో ఇంటర్వ్యూ కెళ్ళినప్పుడు ఎవరైనా ఇదే ప్రశ్న అడిగితే ఇప్పుడొకమాటా అప్పుడొక మాటా అవకుండా చూసుకోవాలి కదా!"

"నిజానికి నేను ఇరవై ఏళ్లనించీ ఈ వూళ్ళో ఉన్నానన్నమాటే గాని ఆ విగ్రహాలు ముప్ఫయి మూడన్న సంగతే నాకు తెలియదు! అయితే ఇంతకీ ఏమిటి రాసేవు?"

"ఇదిగో, నువ్వే చూసుకో." అని కార్బన్ కింద పెట్టిన కాపీ ఇచ్చేడు.

మా మేనల్లుడు చేసిన విగ్రహ విశ్లేషణ చూసి నాకు మతిపోయినంత పనైంది. వాడు ఇందాకా చేసిన విభజనే కాకుండా అందులో స్త్రీ లెందరు, పురుషులెందరు. కవులెందరు, గాయకులెందరు, వాగ్గేయ కారులెందరు, అసలు ఆంధ్రులే కాని వారెందరు- ఇలాగ సబ్ డివిజనూ ఫ్రాగ్మెంటేషనూ చేసి అదరగొట్టేసేడు. చివరగా రెండు పాయింట్లు రాసేడు. ఆ విగ్రహాల్లో ఎన్నింటికి ఆడా మగా తేడా లేకుండా ఎన్టీ ఆర్ గారి పోలికలు ఉన్నాయి అన్నది ఒకటి; ఎన్టీ ఆర్ గారి గురువుగారైన విశ్వనాథ సత్యనారాయణ గారి విగ్రహం పెట్టించకపోవడం ఒక గొప్ప లోటు అని రెండోది.

"పోలికల జోలికి పోకుండా వుండవలసింది. వాళ్ళు చిరాకు పడతారేమో?" అన్నాను.

"ఇతర్ల విగ్రహాలు పెట్టిస్తే పోలికలు తప్పవు. ముఖ్యంగా ఆ చారిత్రాత్మక వ్యక్తులు శతాబ్దాలకి పూర్వం వాళ్లు అయితే మరీనీ, బ్రహ్మనాయుడు, వీరబ్రహేంద్ర స్వామి, కృష్ణ దేవరాయలు

ఉన్నారనుకో, ఆ విగ్రహాలు, చెక్కే శిల్పికి ఎన్టీ ఆర్‌గారు ఆయా సినిమాల్లోని స్టిల్స్ ఇవ్వకుండా వుంటారా?"

"ఏమో. నీ థియరీ నాకు నచ్చలేదురా."

"ఆ మధ్య తమిళనాడులో ఒక ప్రముఖుడు ఒక దేవత విగ్రహం పెట్టించినప్పుడు ఆ శిల్పిగారు ఆ నాయకుడి భార్యరూపం ఆధారంగా ఆ విగ్రహం చెక్కేడట, శిల్పి. దాంతో పెద్ద గొడవైపోయి, ఆ విగ్రహం పడగొట్టించే దాకా వూరుకోలేదు, జనం!"

"ఓరి నీ అసాధ్యం కూలా!" అన్నాను.

"మనకి ఆ భయం లేదులే, విగ్రహాలు పెట్టించడం ఎంత కష్టమో వాట్ని పడగొట్టించడం యింకా కష్టం" అన్నాడు మా మేనల్లుడు.

"అవును కాబోలు..." అన్నాను.

"అందుకే అన్నారు మనవాళ్ళు; నైవేద్య నష్టి, విగ్రహపుష్టి-అని! నా పనీ అలాగే అయింది లే."

"అదేమిటి ఆ మాట?"

"అదంతే, వాళ్ళు నాకు ఉద్యోగం యివ్వడం లేదు!" ★

# 97. విషాదపట్నం ఆటోకాండ

**మా** మోహనరావుకి విశాఖపట్నం కేంపు తగిలినప్పుడల్లా ముందుగా నాకు ఉత్తరం రాస్తూ ఉంటాడు. సందర్భాన్ని బట్టి ఒక టాక్సీ బుక్ చెయ్యమనీ, ఎవరిదైనా స్కూటరు అడిగి మనింటి దగ్గరుంచమనీ రాసేవాడు. నేను స్కూటర్ కొన్నాక ఏకంగా నన్ను సెలవు పెట్టేసి ఇంటి దగ్గరుండిపోమనడం ప్రారంభించేడు. ఇప్పుడతనికి స్కూటరూ డ్రైవరూ కూడా "ఫ్రీ" కదా. ఓ సారి అతను ఒస్తానన్న రోజుకి నా స్కూటరు వర్క్‌షాపులో ఉండిపోయింది. ఆ సంగతి తెలియక దిగినవాడు నా స్కూటర్ కోసం మా ఇంటికి వచ్చి ఆశాభంగం చెందుతాడని, ముందు జాగ్రత్త చర్యగా నేను అతను రైలు దిగే వేళకి స్టేషన్‌కెళ్లాను. అదుగో, అప్పట్నుంచే మా మోహనరావుకి ఆటోలు అలవాటయ్యాయి, ఈ వూళ్ళో.

మా మోహనరావు ఆటోల వాళ్ళతో జరిపే సంభాషణ చాలా చమత్కారంగా వుంటుంది.

రైలు దిగి ఓ చేత్తో సూట్‌కేసు పట్టుకుని మోహనరావు ఇవతలికొస్తాడు కదా.

"ఆటో, సార్?" అని ఎవరో పలకరిస్తారు.

"ఏదీ, ఏదీ?" అని బెదిరిపోయి పక్కకి తప్పుకుంటాడు మోహనరావు.

"బలేవారే సార్, ఆటో కావాలాని అడుగుతున్నాం!"

"ఏరీ, ఏరీ?"

"ఎవరండీ?"

"అడుగుతున్నాం- అన్నారు కదా. మిగిలిన వాళ్ళు ఏరీ?"

అడిగిన మనిషి చల్లగా జారుకుంటాడు.

నాలుగడుగులు నడవగానే ఇంకొకడొస్తాడు.